వ్యక్తిత్వం

శుశ్రుత హాస్పిటల్ ముందు ఆగింది మారుతి కారు.

ప్రొఫెసర్ శ్రీనివాస్, ఆయన మిసెస్ హాడా విడిగా కారు దిగి, ప్రసవవేదన పడుతున్న తమ కూతురు రేఖను మెల్లగా లోనికి తీసుకెళ్లారు.

రిసెప్షనిస్ట్ దగ్గరకి వెళ్ళి విషయం చెప్పారు.

రిసెప్షనిస్ట్ టైం చూసి యం.డి.కి ఫోన్ చేసి గైనకాలజిస్ట్ విద్యాధరి అపుడే యింటికి వెళ్లిందని, ఆ సమయంలో యీ కేసు వచ్చిందని చెప్పింది.

యం.డి. వెంటనే రేఖని ఆపరేషన్ థియేటర్ లోపలికి పంపే ఏర్పాటు చేసి, విద్యాధరికి ఫోన్ చేసి విషయం చెప్పాడు.

మరో పదినిమిషాలలో విద్యాధరి వచ్చింది. అప్పటికే ఆపరేషన్ థియేటర్‌లో అన్ని ఏర్పాట్లూ జరిగాయి. శ్రీనివాస్ చాలా కంగారుగా ఉన్నాడు. అతడు నగరంలో డిగ్రీ కాలేజిలో కెమిస్ట్రీ ప్రొఫెసర్.

విద్యాధరి రాగానే పేషంట్‌ని చూసి శ్రీనివాస్ దగ్గరకు వచ్చింది

"ఏంటండీ! యింత నెగ్లెక్ట్ చేశారు. ముందుగా రావచ్చుగా. యిపుడు సిజేరియన్ చేయాలి..." అంది రిపోర్ట్స్ చూస్తూ...

"అదికాదు డాక్టర్! అమ్మాయి డెలివరీ డేట్ యింకో పదిరోజుల తర్వాత ఉంది. అంతలోనే

యిలా... ఎనీహౌ మీరే రక్షించాలి" అన్నాడు శ్రీనివాస్ ప్రాధేయపడుతూ!

"సరే! నా ప్రయత్నం చేస్తాను. మీ పేరు?"

"శ్రీనివాస్! కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా"

విద్యాధరి తలఎత్తి కాస్త పరిశీలనగా చూసింది.

"మీరు నరసాపురంలో పనిచేసారుకదూ" అడిగింది అనుమానంగా!

"అవును చాలా ఏళ్ళ క్రితం" అన్నాడు శ్రీనివాస్ అర్ధంకాక.

"నేనండీ మాస్టారూ! యిరవై రెండేళ్ల క్రితం... నరసాపురంలో... విద్యాధరిని"

"నువ్వా! సారీ... మీరా!" తడబడ్డాడు శ్రీనివాస్.

"భలేవారు సార్! సారీ ఏంటి? మీరు మా మాస్టారు! సరే... ముందు పేషంట్ విషయం చూసి తర్వాత మాట్లాడుకుందాం" అంటూ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లింది విద్యాధరి.

శ్రీనివాస్ మనసంతా అల్లకల్లోలం అయింది. ఇలా మళ్లీ విద్యాధరిని చూస్తాననుకోలేదు. తన గురించి ఏమని భావిస్తోంది? అసలు తనను ఆ విషయం గురించి అడిగితే ఎలా సమాధానం యివ్వాలి? ఇక ఆలోచించలేక భార్యతో అర్జంట్ పని ఉందని అంటూ కొంత డబ్బు ఆమె చేతిలో ఉంచి బయటకు వచ్చాడు.

అరగంట తర్వాత విద్యాధరి ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చి "బై గాడ్ బ్లెస్... అమ్మాయి. బేబీ యిద్దరూ క్షేమంగా ఉన్నారు... అన్నట్లు మాస్టారు ఎక్కడ?" అని అడిగింది.

"చాలా సంతోషం తల్లీ! మీ మాస్టారు ఏదో చాలా అర్జంట్ పని, యిప్పుడే వస్తానని వెళ్లారు" అంది మిసెస్ శ్రీనివాస్.

'ఇక ఇక్కడికి రావడం జరగదులెండి' అని మనసులో అనుకొని "మీ అడ్రస్ యిస్తారా! నేను ఎపుడయినా వచ్చి కలు



టి. సురేశ్‌బాబు

స్తాను” అంది విద్యాధరి.

ఆమెకు అడ్రస్ యిచ్చి, థాంక్స్ చెప్పి, ఫీజు చెల్లించి కూతురు ఉన్న రూమ్‌లోకి వెళ్లింది మిసెస్ శ్రీనివాస్.

“మాస్టారూ! యింత నాటకం ఆడతారా! దేనినయినా సహిస్తాను కానీ అబద్ధాలు సహిం చను అని చెప్పే మీలో యింతటి నయవంచ నా?” అనుకుంటూ యింటికి బయలుదేరింది విద్యాధరి.

* * *

వారం రోజుల తరువాత... ఓ సాయం కాలం వీలు చూసుకొని శ్రీనివాస్ యింటికి బయలుదేరింది విద్యాధరి.

మెల్లగా కారుని డ్రైవ్ చేస్తున్న విద్యాధరి మదినిండా ఆలోచనలు... గతకాలపు జ్ఞాపకా లు సుడులు తిరుగుతున్నాయి. అసలు తనకు తిరిగి ఈ జన్మలో శ్రీనివాస్ మాస్టారు కనిపి స్తాడనుకోలేదు. కనిపించినా యిలా ఫ్యామిలీతో వస్తాడన్న ఆలోచనే రాలేదు. ఎందుకిలా జరి గింది? తను ఎంతో గౌరవప్రదంగా, ఉన్నతం గా భావించే ఆదర్శ పురుషునిలో యింతటి దగాకోరుతనమా? కళ్లలో నీళ్లు తిరిగాయి.

మాస్టారూ! మీతో ఏడడుగులు నడిచి, జీవి తాన్ని సాఫల్యం చేసుకోవాలన్న నా కోరికను మొగ్గలోనే త్రుంచి యిలా మీరు హాయిగా ఉండ డానికి నేనేం పాపం చేశాను?

కనుల్లో నిండిన నీటికి ఎదురుగా రోడ్డు మీద దృశ్యాలు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. కను లు తుడుచుకొంది. మనసులో మాత్రం ఎంత వద్దన్నా యిరవై రెండు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు జ్ఞాపకం వస్తున్నాయి.

* * *

ఉదయం ఎనిమిది గంటలు.

ఇంటిముందు గల పెరడులోని కాంపౌండ్ వాల్ ప్రక్కనే గల సన్నజాజి పందిరి క్రింద చదువుకుంటోంది విద్యాధరి.

విరబూసిన సన్నజాజులు గాలికి రాలి పడు తున్నాయి. పదహారు సంవత్సరాల ప్రాయం... కనులు ప్రక్కకు తిప్పుకోనివ్వని అద్భుత దేహ సౌందర్యం. నల్లని పొడవయిన వాల్జడ. తెల్లని మెరుపులా పలువరుస... దేహమంతా వాటి వాటి స్థానాల్లో సరియైన రూపంలో ప్రకాశి స్తున్న అవయవ సంపద.

విద్యాధరి తండ్రి మంచి వ్యాపారస్థుడు. రెండంతస్థుల బంగళా. ఆర్థికంగా ఏ యిబ్బం దులూ లేని జీవితం. పదవతరగతి చదువు తోంది.

“అమ్మా! విద్యా! రామ్మా! స్కూలుకు టైం అవుతోంది...” యింట్లోంచి పిలిచింది విద్యా ధరి తల్లి.

“ఆ... వస్తున్నా” అంది కోయిల గొంతు కతో... బుక్స్ తీసుకొని యింట్లోకి రాబోతుం డగా యింటిముందు ఏదో వెహికిల్ ఆగిన శబ్దం విన్పించింది.

ఒక్క క్షణం ఆగి చూసింది. ఎదురింట్లో ఎవరో చేరుతున్నారు కాబోలు టాక్సీలోంచి పాతి కేళ్ల యువకుడు దిగాడు. నలుపురంగు ప్యాం టు, లేత నీలిరంగు చొక్కా ధరించాడు. కాస్త ఉంగరాల జుట్టు. నిండైన విగ్రహం... ముఖం లో చిరునవ్వు.

మనసంతా అదోరకమయిన తన్మయత్వ భావనతో నిండిపోయింది. ఎవరబ్బా యీ నవ మోహనాకారుడు అనుకుంటూ యింట్లోకి నడి చింది.

* * *



క్లాసంతా అల్లరిగా ఉంది.

అంతలో హెడ్‌మాస్టర్‌గారు ఒక యువకుడిని వెంటబెట్టుకొని వచ్చారు. క్లాస్ సైలెంట్‌గా మారింది. అంతా ఆత్రంగా చూస్తున్నారు. విద్యాధరి తను వ్రాస్తున్న నోట్‌బుక్ మూసి తలపైకెత్తి చూసింది. ఎదురుగా అతడే... తను ఉదయం చూసిన నవమోహనాకారుడు.

“డియర్ స్టూడెంట్స్! ఇవేళ చాలా శుభ దినం. ఎందుకంటే స్కూలు తెరచి నెలగడిచినా మనకు సైన్స్ టీచర్ లేకపోవడం చాలా యిబ్బందిగా ఉంది కదా! ఈరోజు మిస్టర్ శ్రీనివాస్‌గారు మన పాఠశాలకు సైన్స్ మాస్టారుగా వచ్చారు. మీరందరూ యీ మాస్టారు బోధనలో మంచి ఫలితాలు సాధిస్తారని ఆశిస్తాను” అంటూ పరిచయం చేశారు హెడ్‌మాస్టర్.

“అంటే...యీ సుందరాంగుడు కొత్త సైన్స్ మాస్టారా! థాంక్స్ మైగాడ్” అనుకుంది చిన్నగా నవ్వుకుంటూ విద్యాధరి.

తర్వాత శ్రీనివాస్ యింట్రడక్షన్ క్లాస్ తీసుకున్నాడు... ఏ మాత్రం తడబడని వాక్ప్రవాహం... మాటలకు అనుగుణంగా హావభావాలు... బ్లాక్‌బోర్డ్‌పై అందమయిన దస్తూరి... తియ్యటి గంభీరమయిన కంఠం... ఆకట్టుకునే మాటలు... క్లాస్ జరిగినంతసేపూ అతడినే కన్నార్పకుండా చూసింది విద్యాధరి. మనసులో తెలియని ఆరాధనా భావం.

సాయంకాలం...“అమ్మా! ఎదురింట్లో కొత్తగా వచ్చిన మా మాస్టారు చేరారు... సబ్జెక్ట్‌లో డౌట్స్ తీర్చుకొని వస్తాను” అని చెప్పి శ్రీనివాస్ యింటికి వచ్చింది విద్యాధరి.

శ్రీనివాస్ బయట చైర్లో కూర్చొని ఏదో చదువుకుంటున్నాడు.

“నమస్తే సర్” అంది విద్యాధరి.

తలపైకెత్తి చూశాడు. అప్సరస లాంటి సౌందర్యం.

“నీవు?” అన్నాడు ప్రశ్నార్థకంగా...

"నా పేరు విద్యాధరి సర్! మీరు పనిచేసే స్కూల్లో పదోతరగతి చదువుతున్నా! సబ్జెక్ట్ డౌట్స్ తీర్చుకోడానికి వచ్చాను. మీ యింటికి ఎదురుగానే మా యిల్లు"

"కూర్చోమ్మా!"

ఏవో కొన్ని డౌట్స్ అడిగింది... చెప్పాడు.

"సర్! రోజూ వచ్చి నేను యిక్కడ చదువుకో వచ్చా" అంది అమాయకంగా ముఖం పెట్టి.

"దానికేం! చదువుకో"

"థాంక్స్ సర్" అంది ఆనందంగా విద్యాధరి. అంతలో యింట్లోంచి ఓ యాభైఏళ్ల ఆవిడ బయటకు వచ్చింది. "ఎవర్రా యీ అమ్మాయి" అంది రాగానే!

"అమ్మా! నా స్టూడెంట్! ఎదురింట్లో ఉంటారట" అన్నాడు శ్రీనివాస్.

"అలాగా" అంటూ లోపలికి వెళ్లింది.

విద్యాధరి వారిద్దరినీ చూస్తూ ఉండిపోయింది.

"మా అమ్మ! నేను, మా అమ్మ ఉంటాము. అక్కయ్య విజయవాడలో ఉంటోంది" చెప్పాడు శ్రీనివాస్.

"అయితే యీ సుందరాంగునికి యింకా పెళ్లికాలేదన్నమాట" లోలోన సంతోషించి "సరే మాస్టారూ! వస్తాను" అంటూ బయలుదేరింది.

అలా ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలకు వచ్చి ఎనిమిది దాకా చదువుకోవడం అలవాటయింది.

ఓరోజు యింట్లో తయారుచేసిన స్వీట్లు తెచ్చింది.

"తీసుకోండి సర్" అంటూ యిచ్చింది.

"వద్దమ్మా" అన్నాడు శ్రీనివాస్ సున్నితంగా!

"లేదు సర్! మా యింట్లో ఈ రోజు పండుగ. తీసుకోండి సర్" అంటూ బలవంతంగా శ్రీనివాస్ చేతిలో ఉంచింది. అప్రయత్నంగా శ్రీనివాస్ చేతులు విద్యాధరి చేతులను తాకాయి.

ఒళ్లంతా ఝల్లుంది. తెలియని అనిర్వచనీయ భావవాహిని శరీరమంతా ప్రవహించింది. చూపులు కలిసాయి. విద్యాధరి కాస్త సిగ్గుతో తలవాల్చింది.

* * *

క్లాస్ జరుగుతోంది.

శ్రీనివాస్ తదేకంగా పాఠం చెబుతున్నాడు. విద్యాధరి మాత్రం అతడి వంకే కన్నార్పకుండా చూస్తోంది. మధ్యమధ్యలో పిల్లలందరినీ కలయజూస్తూ పాఠం చెబుతున్న శ్రీనివాస్ అప్రయత్నంగా విద్యాధరిని చూశాడు. ఆ అమ్మాయి తన్ను తినేసేలా చూస్తోంది. మనిషి తడబడ్డాడు. చూపు ప్రక్కకు త్రిప్పాడు.

మనసు స్వాధీనం తప్పుతోంది. అయస్కాంతం యినుపముక్కను లాగినట్లు ఆ అమ్మాయి ఆశగా చూసే కనులు రమ్మంటున్నాయి.

అప్పుడే "టెలిగ్రాం సర్" అంటూ వచ్చి యిచ్చాడు పోస్ట్‌మాన్.

దాన్ని చదువుకొని మరలావస్తానని చెప్పి హెడ్మాస్టర్ వద్ద పర్మిషన్ తీసుకొని ఇంటికి వెళ్లాడు శ్రీనివాస్.

విద్యాధరికి ఏంజరిగిందో అర్థంకాక సాయంకాలం వరకూ భారంగా గడిపింది. సాయంత్రం యింటికి రాగానే మాస్టారు ఇంటివైపు చూసింది. తలుపులు తెరిచే ఉన్నాయి.

"హమ్మయ్య! మాస్టారు ఉన్నారన్నమాట" అనుకొని ఊపిరి పీల్చుకొంది. ఆరుగంటలు

కాగానే శ్రీనివాస్ ఇంట్లోకి పరుగుతీసింది.

యధాప్రకారం కూర్చుని చదువుకుంటున్నాడు శ్రీనివాస్.

వచ్చికూర్చొంది విద్యాధరి. ఇంట్లో అలికిడి లేదు.

"అమ్మగారు లేరా సర్?" అడిగింది విద్యాధరి.

"లేదమ్మా! విజయవాడలో అక్కయ్య ఆరోగ్యం బాగాలేదని టెలిగ్రాం వస్తే అమ్మను పంపాను" అన్నాడు శ్రీనివాస్.

"అయితే ఒక్కరే ఉన్నారన్నమాట" అంది ఒక విధమయిన ధ్వనితో.

"అవును" అన్నాడు శ్రీనివాస్ విద్యాధరి వైపు చూడకుండానే.

విద్యాధరి చదువుతోంది గానీ మనసు మనసులో లేదు. ఏదో చదువు అయింది అన్పించి ఇంటికి వెళ్లింది.

మరో పదినిమిషాల్లో రెండు గిన్నెల్లో కూర, పచ్చడి తీసుకువచ్చింది.

"ఏంటమ్మా ఇది" అన్నాడు శ్రీనివాస్.

"ఒంటరిగా అన్నీ ఏం వండుకుంటారు సర్! కారియర్ తెస్తానంటే మీరు ఒప్పుకోరని అమ్మ పచ్చడి, కూర పంపింది. మీరు కాదనకూడదు" అంటూ అక్కడ పెట్టి ఓరగా ఓకంట చూసి వెళ్లింది. ఆ చూపు బాకులా గుచ్చుకుంది శ్రీనివాస్‌కి.

అలా వారం గడిచింది.

"మాస్టారూ! ఈమధ్య అంతగా చదవాలని పించడం లేదు"

"ఏం! ఎందుకని? ఆరోగ్యం బాగాలేదా?" అడిగాడు శ్రీనివాస్.

"ఆరోగ్యం బాగానే ఉంది. మనసే బాగోలేదు"

"ఎందుకని?"

"మిమ్మల్ని ఓమాట అడిగితే ఏమీ అనుకోరుగా?"

"అడుగు దానికేం"

"మాస్టారూ! మీ రూపం నన్ను సమ్మోహన పరుస్తోంది. మీ వ్యక్తిత్వం నన్ను నిలువనీయడం లేదు. నా మనసంతా మీ రూపం నిండి తన్మయత్వమవుతోంది. మీరు కనబడితేచాలు ఆనందం... నవ్వితే అనిర్వచనీయమయిన భావం... కనుల ముందు మీరు కదలాడితే సంతోషతరంగాలు మనోసరోవరంలో కదలాడుతాయి. ఇదంతా ఊరికే చెప్పడం లేదు. మీరు లేకపోతే నేను జీవించలేను... మిమ్మల్ని... మిమ్మల్ని... మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను" అంటూ గబగబా చెప్పింది విద్యాధరి.

నిర్ఘాంతపోయాడు శ్రీనివాస్.

ఇలాంటి సంఘటన ఎదురవుతుందని భావించలేదు. అనుకోకుండా ఇలా... ఏం చెప్పాలి?

"చూడమ్మా! నువ్వు చిన్నపిల్లవు... ఇలా భావించడం మంచిది కాదు. ముందు చదువు పై దృష్టిపెట్టు" చెప్పబోయాడు శ్రీనివాస్.

"సర్! అవన్నీ నాకు అనవసరం... మీరు నాకు నచ్చారు అంతే! అయినా మీరు ఇంకా పెళ్లి చేసుకోలేదుగా! పెళ్లయిన వారిని ఇష్టపడి వారి సంసారాలను నాశనం చేస్తే తప్పుగానీ... నేను ఇలా కోరుకోవడం తప్పా? అసలు మీ అభిప్రాయం చెప్పండి" మోహావేశంతో ధైర్యంగా అడిగింది విద్యాధరి.

బదులివ్వలేదు శ్రీనివాస్.

"మాస్టారూ! నేను అందంగా లేనా?"

"అదికాదమ్మా! మన మధ్య పవిత్రమయిన గురుశిష్య సంబంధం ఉంది. ఇలా ఆలోచించడం తప్పు"

"అదికాదు సర్! నేను నచ్చలేదా?" రెట్టించింది.

తన స్వచ్ఛమయిన వ్యక్తిత్వం... ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకు గల గౌరవభావం, విద్యార్థులపై గల అనురాగం... ఎలా చెప్పాలి? పూర్తిగా కౌమారదశలోని మోహావేశంలో మునిగిన ఈ పిల్లకు ఎలా చెప్పాలి?

"విద్యా! నన్ను పెళ్లిచేసుకుంటే నీవు జీవితాంతం శోకించాల్సి ఉంటుంది" అన్నాడు మెల్లగా ఏదో ఒక స్థిర నిర్ణయానికి వచ్చినట్లు శ్రీనివాస్.

అర్థంకానట్లు చూసింది విద్యాధరి.

"నాకు సంతానం ఇచ్చే శక్తిలేదు" అని చెప్పి కనులు మూసుకున్నాడు శ్రీనివాస్.

ఉలిక్కిపడింది విద్యాధరి. భూమి బ్రద్దలయినట్లయింది. నమ్మలేకపోయింది... కానీ మాస్టారు... అబద్ధం చెప్పడు... కనుల్లో నీరు తిరిగింది.

"అవును... అందుకే ఇలా బ్రహ్మచారిగా ఉన్నాను... ఇంతకంటే నేనేం చెప్పలేను"

విద్యాధరి బదులివ్వకుండా ఇంటికి వెళ్లింది.

తర్వాత చదువుకోవడానికి మరలా రాలేదు. క్లాస్‌లో నిర్లిప్తంగా ఉండిపోయింది. అంతలో పరీక్షలు, సెలవులు... కాలం సాగిపోయింది.

శ్రీనివాస్ లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చి వెళ్లిపోయాడు.

* * *

గత జ్ఞాపకాలన్నీ వచ్చి తడిమి వెళ్లిపోయే సరికి శ్రీనివాస్ ఇల్లు వచ్చింది. కారు పార్కుచేసి లోపలికి వెళ్లింది విద్యాధరి.

ఆమెను చూడగానే "మీరా? రండి! రండి" అంటూ ఆహ్వానించింది ప్రొఫెసర్ శ్రీనివాస్ భార్య విజయలక్ష్మి.

సోఫాలో కూర్చుంటూ "అమ్మాయి క్షేమంగా ఉందా?" అడిగింది విద్యాధరి.

"అంతా నీ దయమ్మా! హాయిగా ఉంది. ఉదయమే అత్తారింటికి వెళ్లింది... పెళ్లి అని"

"మాస్టారు లేరా?"

"ఇంకా రాలేదమ్మా! ఈ వేళ కాస్త ఆలస్యంగా వస్తానన్నారు. అయినా పర్లేదు. ఈరోజు డిన్నర్ ఇక్కడే. అంతలోగా మాస్టారు వస్తారు" అంది విజయలక్ష్మి.

"అబ్బే! వద్దమ్మా! మరోసారి వస్తాను"

"అదేం వీల్లేదు... మీరు కాదనకూడదు. కావాలంటే కాలక్షేపానికి మాస్టారు వచ్చేవరకూ అదిగో ఆ రాక్‌లో బుక్స్ ఉన్నాయి" అంటూ ఇంట్లోకి వెళ్లి, రెండు నిమిషాల్లో కాఫీ తెచ్చింది విజయలక్ష్మి. ఇక తప్పలేదు. కాఫీ సిప్ చేస్తూ బుక్స్ వద్దకు వెళ్ళింది. విజయలక్ష్మి కిచెన్‌లోకి వెళ్లింది.

రాక్‌లో బుక్స్ అందంగా అమర్చబడిఉన్నాయి. డైరీల వంక చూసింది. శ్రీనివాస్ జాబ్‌లో చేరినప్పటి నుంచి ప్రతి సంవత్సరం డైరీలు వరుసగా ఉన్నాయి. వాటిపై ఏ ఊళ్లో పనిచేశాడో వాటి పేర్లూ ఉన్నాయి. 'నరసాపురం' అన్నపేరు డైరీపై చూసి అప్రయత్నంగా దాన్ని తీసుకొంది.

ఇతరుల డైరీలు చదవకూడదని తెలిసినా మనసు ఎందుకో ఉబలాటపడింది. అక్కడే కూర్చొని పేజీలు తిప్పసాగింది.

ఓ పేజీలో తనపేరు మీదుగా వ్యాఖ్యానం కన్పించింది.

"విద్యాధరీ!

ఈ రోజు అనుకోకుండా నీవు నన్ను ప్రేమిస్తున్నానని చెప్పావు. నాకేం పాలు పోలేదు. అది తప్పు అని చెప్పినా నీవు వినవు, వినలేవు. వినలేని స్థితి. అది నీ వయసు ప్రభావం - అర్థం చేసుకోగలను.

కానీ...

నాది ఓ ఖచ్చితమయిన వ్యక్తిత్వం. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న నాకు విద్యార్థుల పట్ల అభిమానం, అనురాగమే కానీ మరో వికృతభావన లేదు. ఉండరాదు అన్నది నా సిద్ధాంతం.

వయసు కలిగించే తొందరలకు, మనసు ప్రక్కదారులు పట్టడానికి లోనయ్యే కౌమార దశలో యిలా తొందరపడి నిర్ణయం తీసుకుంటే పవిత్రమైన గురుశిష్య సంబంధానికి అస్తిత్వం ఉంటుందా? ఎక్కడో ఏదో జరిగింది అని అదే త్రోవలో కుసంస్కారంతో వెళితే యీ పవిత్ర భారతీయ సంస్కృతి మురుగు కాల్వలా మారుతుంది. అలా కావడానికి నేనూ ఓ కారణం కావడం నాకు ఇష్టం లేదు.

అందుకే... నా సిద్ధాంతాలకు, లక్ష్యాలకు, ఉద్దేశ్యాలకు అనుగుణంగా అయిష్టంగానే అసత్యమాడవలసి వచ్చింది.

నిజంగా నేను పుంస్త్వం లేనివాడిని కాదు... అలా చెప్పవలసి వచ్చింది... దాని వల్ల నీకు మానసిక క్షోభ కలిగించి ఉండవచ్చు. కానీ విద్యార్థుల పట్ల నాకున్న స్వచ్ఛమయిన అనురాగాన్ని కలుషితం చేయలేను.

ఒకవేళ ఏరోజయినా నేను అసత్యం చెప్పిన విషయం నీకు తెలిసినా నీవు అర్థం చేసుకోగలవని నా భావన.

ఎందుకంటే తల్లి, తండ్రి, గురువు అన్నారు. అంటే గురువు తల్లిదండ్రుల కన్నా పిల్లల్ని యింకా ఎక్కువగా ప్రేమించాలి, రక్షించాలి. చెడు దారుల నుంచి మళ్లించాలి. నీవు మంచి చదువులు చదివి అభివృద్ధిలోకి రావాలి. ఇది నా ఆకాంక్ష... ఆశీర్వాదం..."

చదవడం పూర్తయ్యాక మనసంతా అదోలా అయింది.

'మాస్టారూ? మీ ఉదాత్తమయిన వ్యక్తిత్వం సరిగా అర్థం చేసుకోలేక పోయాను. సారీ! నిజంగా ఇలాంటి ఆదర్శయుత వ్యక్తిత్వం చాలా మందిలో నేడు లోపించింది. అందుకే సభ్యసమాజం తలవంచుకునేలా అత్యాచారాల గురించిన వార్తలు పేపర్లో రోజూ చూస్తున్నాము. మీ ఉదాత్తమయిన నిగ్రహశక్తికి నా జోహార్లు" మనసులోనే అనుకొంది విద్యాధరి... ●

పొదుపు

భర్త అడిగాడు... డాక్టరు గారు పూటకి రెండు చెంచాల మందు ఇవ్వమంటే... నువ్వు ఒక చెంచానే ఇస్తున్నావేంటీ?

'మీరేగా... ఏదయినా పొదుపుగా వాడమని చెప్పారు. నాదేం పోయిందీ... పూటకో సీసా తాగండి...' అని విసుక్కుంది... జ్వరంతో పడుకున్న భర్తమీద!